క్లుప్తంగా

'లఖ్ పతి దీదీ' సర్టిఫికెట్ల అందజేత



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

వీరవాసరం: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం లఖ్‌పతి దీదీలకు, సీఆర్‌పీలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మహిళలంతా ఆర్థికంగా ముందుకు సాగాలని, ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని వక్తలు కోరారు. కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ రూ.10 లక్షలను 10 డ్వాక్రా సంఘాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యులు గుండా జయప్రకాష్, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఏపీఎం, డ్వాక్రా సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మకు సారె



పెద్దింట్లమ్మవారికి సారెను సమర్పిస్తున్న మహిళలు

ఆకివీడు: ఆకివీడు గ్రామ దేవత శ్రీ పెద్దింట్లమ్మ అమ్మవారికి ఆదివారం శ్రావణమాస సారెను భక్తులు సమర్పించారు. ఆకివీడు పంచాయతీ పరిధిలోని 13వ వార్డులో ఉన్న మార్త్యేరు సాహెబ్ గారి వీధి, నాయుడు వీధులకు చెందిన మహిళలు అమ్మవారికి ఈ సారె అందించారు. ఈ సందర్భంగా సన్నాయి వాయిద్యాలతో ఆ ప్రాంతం నుంచి ఆలయం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. అనంతరం అమ్మవారికి చలివిడి, పానకాలు, పసుపు కుంకుమ, గాజులు, పిండి వంటలు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న దాత

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి పట్టణానికి చెందిన విద్యా చైతన్య శ్రీనివాస దీప్తి 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. తొలుత దాత కుటుంబం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



భీమవరంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కాళీచరణ్

భీమవరం: తీరు మార్చుకోకుండా చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు మళ్లీ పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ కాళీచరణ్ రౌడీ షీటర్లను హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతోపాటు హోటళ్లు, లాడ్జిలు, క్లబ్‌లలో ఆకస్మిక తనిఖీలు, విస్తృతంగా సోదాలు నిర్వహించారు. హోటళ్లలో రికార్డులను, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలపై ఖచ్చితమైన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

ఆఖరి మజిలీలో అనాథలకు అండగా



దహన సంస్కారాలు చేస్తున్న మానవత జిల్లా నాయకులు మోహనరావు, తదితరులు

పెంటపాడు: అనాథలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని మానవత ఉమ్మడి జిల్లా మాజీ చైర్మన్ తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. ఆదివారం పెంటపాడులో దిక్కులేని ఒక అనాథ సుజాత అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. కాగా ఈ విషయం తెలుసుకున్న తాడేపల్లి మోహనరావు వెంటనే అక్కడకు చేరుకొని తన సొంత ఖర్చుతో మానవత హిందూ స్మశాన వాటికకు వాహనం ద్వారా తరలించి, దహన సంస్కారాల తంతును పురోహితుల ద్వారా పూర్తి చేయించి, బంధువులకు చేసినట్లుగా దహన సంస్కారాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మానవత సభ్యుడిని అయినందుకు గర్విస్తున్నానన్నారు. ఇప్పటికీ మూడు అనాథ శవాలకు దహన సంస్కారాలు చేశానన్నారు. ఈ పనిని తాను దైవకార్యంగా భావిస్తానని పేర్కొన్నారు. మండల మానవత సభ్యులు తారాడి పాల్, ఏలూరి వీరాస్వామి పాల్గొన్నారు.



వైద్య సిబ్బందిపై దాడులు దుర్మార్గం



రోగుల ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో సేవలందించే వైద్య సిబ్బందిపై దాడులు చేయడం దుర్మార్గం. దాడుల నుంచి వైద్యులకు భద్రత కల్పించాలి. రోగులను కుటుంబ సభ్యులుగా భావించి వైద్యం చేస్తాను. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ ఘటన అనంతరం విధులకు వెళ్లాలంటేనే భయమేస్తోంది. ప్రాణాలు కాపాడే డాక్టర్లపైనే అఘాయిత్యాలు జరుగుతుంటే భవిష్యత్తులో ఎవరూ డాక్టర్లు అయ్యేందుకు ఇష్టపడరు. ఈ తరహా దాడులను అరికట్టడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేసి భద్రత కల్పించాలి.

– ఉష, స్టాఫ్ నర్సు, గొల్లవానితిప్ప పీహెచ్‌సీ

భయాందోళనలో డాక్టర్లు



కోల్‌కతా సంఘటనతో డాక్టర్లమంతా ఆందోళనతో విధులు నిర్వర్తిస్తున్నాం. రోగి ప్రాణాలు కాపాడే డాక్టర్లు దైవంతో సమానమనే నానుడిని కొంత మంది వ్యక్తులు అగౌరవపరుస్తున్నారు. ప్రతి ఆసుపత్రి ఆవరణలో పోలీస ఔట్‌పోస్టును ఏర్పాటు చేసి పగలు, రాత్రి వైద్యులకు రక్షణ కల్పించాలి. దేశంలోని వైద్యుల రక్షణకు ప్రత్యేకమైన రక్షణ చట్టం తీసుకురావాలి. డాక్టర్ల రక్షణకు సుప్రీం కోర్టు తీసుకున్న చర్యలు హర్షణీయం.

– డాక్టర్ ఒ.దినేష్, మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి

గ్రామాల్లో క్షీణిస్తున్న పారిశుద్ధ్యం

- విజృంభిస్తున్న దోమలు.. కానరాని పరిశుభ్రత చర్యలు
- పేరుకుపోతున్న చెత్తకుప్పలు.. పెరుగుతున్న జ్వరపీడితులు



వీరవాసరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్న దృశ్యం

వీరవాసరం: మండలంలో జోరుగా వర్షాలు కురుస్తుండటంతో అసలే అంతంతమాత్రంగా ఉన్న పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. గ్రామాల్లో కనీస నిర్వహణకు నోచుకోక ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోవడంతోపాటు మురుగునీరు సవ్యంగా పారక దోమల వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. పగలు రాత్రీ దోమల మోతతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం పెద్ద మొత్తంలో నిధులు ఖర్చులు చేస్తున్నా ఏమాత్రం ప్రయోజనం ఉండడం లేదు. గ్రామాల్లో ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. పారిశుధ్య నివారణ చర్యలు తూతూమంత్రంగా జరుగుతూ ఉండడంతో ఎక్కడ పడితే చెత్తకుప్పలు పేరుకుపోయి అపరిశుభ్రత వాతావరణం నెలకొంటోంది. ఏ వీధిలో చూసినా చెత్త దర్శనమిస్తుండటం పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తూ కార్యాలయాలకే పరిమితమై మొక్కుబడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. దోమలు, ఈగలు వ్యాప్తి చెంది అంటువ్యాధులు, జ్వరాలతో ప్రజలు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. గతంలో రోజువారి పారిశుద్ధ్య చర్యలతో పాటు వర్షాకాలం శీతాకాలం దోమల నివారణకు స్పెషల్ డ్రైవ్‌ను ప్రత్యేకంగా నిర్వహించేవారు. డ్రెయిన్లలో దోమల సంతతి ఉత్పత్తి కాకుండా దోమల లార్వాలు పెరగకుండా రసాయన మందులను పిచికారీ చేసేవారు. అలాగే ఆయిల్ బాల్స్ గంబూషియా చేపలను మురుగునీటిలో వదిలేవారు. దీంతోపాటుగా మంచినీటిలో పెరిగే డెంగీ కారక దోమల నివారణకు ఇళ్లల్లో కూడా పరిశుభ్ర చర్యలను నిర్వహిస్తుండేవారు. ప్రస్తుతం ఇవన్నీ కనుమరుగైపోయాయి. మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది తక్షణమే స్పందించి గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచి డ్రెయినేజీ వ్యవస్థను పరిశుభ్రపరచాలని ప్రజానీకం కోరుతున్నారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని సుంకర పద్దయ్య వీధిలోని అడబాల చంద్రరావు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పట్టణ వాసవి క్లబ్ ప్రతినిధులు సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. క్లబ్ జిల్లా గవర్నర్ వలివేటి ఎల్ఎన్వీ ప్రసాద్ విగ్రహావిష్కరణ చేసి వలివేటి కల్పన జ్యోతి ప్రజ్వలన చేశారు. కొత్త మహాలక్ష్మి జ్ఞాపకార్థం భర్త కొత్త రాధాకృష్ణ మూర్తి సరస్వతి దేవి విగ్రహాన్ని అందించారు. జిల్లా గవర్నర్ ప్రసాద్ మాట్లాడుతూ చదువుల తల్లి సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విగ్రహ దాతలను అభినందించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బోండాడ రాంపండు, కొత్త రాధాకృష్ణమూర్తి, వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పూసరపు సత్యనారాయణ, రాచపూడి శ్రీనివాస్, కోశాధికారి కొప్పరపు రవికుమార్, కొత్త శ్రీను పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ' ఓటర్ల నమోదు వేగిరపర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయి శ్రీనివాస్

భీమవరం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా అర్హత గల ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఓట్ల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని యూనియన్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ విద్యా రంగంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ఉద్యమ సంఘాల అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. 2018 నవంబర్ 1వ తేదీ నుంచి పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటు హక్కుకు అర్హులన్నారు. ఓటరు నమోదుకు సెప్టెంబర్ 3 చివరి తేదీ అని, అర్హత గల ఉపాధ్యాయులంతా తక్షణమే ఓటర్ నమోదును చేసుకోవాలని కోరారు. పట్టణ అధ్యక్షుడు గుత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సాయి వర్మ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కేవీ రామచంద్రరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.దావీదు, జిల్లా ఆర్థిక కార్యదర్శి పీవీడీ ప్రసాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అడ్డాల కృష్ణ పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



ఏలూరుపాడులో అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

కాళ్ల: మత్తు పదార్థాలకు, గంజాయికి యువత దూరంగా ఉండాలని ఎస్సై ఎన్.శ్రీనివాసరావు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆకివీడు సీఐ పర్యవేక్షణలో ఏలూరుపాడు గ్రామంలో ఆదివారం పోలీసు సిబ్బందితో కలిసి యువతకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలు దుర్భరమవుతాయని అన్నారు. అతివేగంగా వాహనం నడిపి ప్రాణాలు కోల్పోతున్నారని, మత్తు పదార్థాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలకు ఇబ్బంది కలిగిస్తే వారిపై ఎటువంటి కేసులు నమోదు చేస్తారు, ఏఏ శిక్షలు విధిస్తారో వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): వినాయక చవితి ఉత్సవాలకు మట్టి విగ్రహాలనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరుతూ శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో ప్రజలలో అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కలిగొట్ల గోపాలశర్మ, చైతన్య భారతి సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, సంగీత ఉపాధ్యాయులు పైడిరాజు కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగులు, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను పూజకు ఉపయోగించి నదులు, కాలువలలో కలపడం ద్వారా నీరు కలుషితమై పర్యావరణం దెబ్బతింటుందన్నారు. పది రోజులపాటు ఈ ప్రచారం నిర్వహిస్తామని నిర్వాహకులు రంగసాయి తెలిపారు.

అమ్మవార్లకు మహానివేదన



అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం 18వ వార్డులోని శ్రీనివాస సెంటర్ లో శ్రీఆదిలక్ష్మి రాజ్యలక్ష్మి పోలేరమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవంలో భాగంగా అమ్మవారి జాతర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆదివారం ప్రారంభించారు. ముందుగా ప్రత్యేక పూజలను నిర్వహించి మహా నివేదన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నిదానాల కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని, దైవ కార్యక్రమాల్లో అన్న సమారాధనలు నిర్వహించడం భగవత్ సేవతో సమానమన్నారు. అనంతరం 2 వేల మంది భక్తులు అమ్మవారిని ప్రసాదాన్ని స్వీకరించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, గంటా త్రిమూర్తులు, మద్దుల రాము, పిప్పళ్ళ ప్రసాద్, యలమంచిలి శ్రీనివాస్, గోపి, ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నరసాపురం రూరల్: మహిళల జీవన ప్రమాణాలను పెంచి వారు ఆర్థికంగా ఎదిగేందుకు లక్‌పతీ దీదీ యోజన కార్యక్రమం ఎంతగానో దోదహదపడుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ అన్నారు. ఆదివారం నరసాపురం స్టీమర్‌రోడ్డులోని వెలుగు డీఆర్‌డీఏ కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించబడిన లఖ్-పతి దీదీ కార్యక్రమాన్ని డ్వాక్రా మహిళలతో కలిసి బిగ్ స్క్రీన్‌పై వీక్షించారు. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ ఈ పథకం యొక్క విధి విధానాలను మహిళలకు వివరించారు. నడిపూడి పండు, మునుకోటి వెంకటేశ్వరరావు, ఏపీఎం పద్మ పాల్గొన్నారు.

తాళాబత్తులకు తెలుగు వెలుగు పురస్కారం

పాలకొల్లు అర్బన్: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవాల్లో భాగంగా యువ కళావాహిని సాంస్కృతిక సంస్థ, హైదరాబాద్ ఆధ్వర్యంలో గుంటూరు అన్నమయ్య కళా వేదికపై నిర్వహించిన తెలుగు వెలుగులు పురస్కారాన్ని ప్రముఖ నాటక రచయిత, నటులు, దర్శకుడు, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తాళాబత్తుల వెంకటేశ్వరరావుకి అందజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక విలేకరులకు వివరాలను వెల్లడించారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు అందించే ఈ పురస్కారం నాటక రంగ విభాగంలో తనకు లభించడం ఆనందంగా ఉందనిప పేర్కొన్నారు. యువ కళావాహిని ప్రతినిధులు లంకా లక్ష్మీనారాయణ, జి.మల్లికార్జునరామ్‌లు వెంకటేశ్వరరావును శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. తాళాబత్తుల సైకత శిల్పం, సప్తపది, నాన్నా నేనొచ్చేస్తా, అనూహ్యం, దిష్టిబొమ్మలు, విలువ-విలువలు, అమ్మ ఒడి తదితర నాటికలను రచించారు.

రేపు కాళ్లకూరులో ఆలయం మూసివేత

కాళ్ల : కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆలయం మూసివేయనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం.అరుణకుమార్ ఆదివారం తెలిపారు. సంప్రోక్షణ పూజా కార్యక్రమం అనంతరం ఆలయం తెరచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తామన్నారు. అదేవిధంగా రాత్రి 7 గంటలకు స్వామివారికి 12 రకాల విశేష ప్రసాదాలతో నైవేద్యం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

లోవోల్టేజ్ సమస్య నివారణకు చర్యలు

కాళ్ల: దొడ్డనపూడిలో లోవోల్టేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని విద్యుత్ శాఖ మండల ఏఈ రాంబాబు తెలిపారు. గ్రామంలో లోవోల్టేజ్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని విద్యుత్ శాఖ సీజీఎం దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లిన దృష్ట్యా ఆదివారం అధికారులు గ్రామంలో ప్రతి ఇంటిని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో లోవోల్టేజీ సమస్య పరిష్కారం నిమిత్తం గతంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ఇంకా గ్రామంలో ఏదైనా విద్యుత్ సమస్యలు ఉన్నట్లయితే లిఖిత పూర్వకంగా తెలియజేస్తే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

కాళ్ల: పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎన్.శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బొండాడపేట గ్రామ శివారు నేరేడుగురువులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2,050 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రక్తదానం ప్రాణదానమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని వల్లీ మోహన్ యువజన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పటాన్‌వల్లి అన్నారు. సేవా సమితి వారిచే ఆదివారం స్థానిక నార్ని రత్నాలయం ఆసుపత్రిలో 10 మంది రక్తదానం చేశారు. వల్లీ మాట్లాడుతూ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యదర్శి గొల్లేరు మోహన్, గౌరవాధ్యక్షులు అడపా తిలక్, కె.ప్రసాద్, కె.శివ, వై.మధు, పి.రంగారావు, డి.సతీష్, యూ భాస్కర్‌రావు, దినేష్, భరత్, మోహన్ పాల్గొన్నారు.

120 మందికి కంటి పరీక్షలు



సిద్ధాపురంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: అంధత్వాన్ని అంతమొందించేందుకు నిరంతరం కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని లయన్స్ ప్రతినిధి వంటల కృష్ణమూర్తి చెప్పారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో ఆదివారం లయన్స్ క్లబ్, ఐడియల్ విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన కృష్ణమూర్తి మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల కంటి లోపాలను సరిచేసుకోవచ్చునన్నారు. వయసుతో వచ్చే కంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో 120 మంది కంటి పరీక్షలు చేయించుకోగా, వీరిలో కొంతమందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిగురుపాటి చిట్టిబాబు, ఉప సర్పంచ్ నారాయణరాజు, స్థానిక పెద్దలు లయన్స్ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

మానవతా సేవలు మరింత విస్తరిస్తాం



కలిగొట్లలో సమావేశమైన మానవతా సిబ్బంది

ఉండి: పర్యావరణ పరిరక్షణ కోసం మానవతా సేవా సంస్థ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సంస్థ మండల అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్ కృష్ణంరాజు, డాక్టర్ గాదిరాజు రంగరాజు చెప్పారు. ఆదివారం మానవతా మండల చైర్మన్ రుద్రరాజు యువరాజు ఆధ్వర్యంలో కలిగొట్లలో సంస్థ మండల సమావేశాన్ని నిర్వహించారు. రాబోయే రోజుల్లో పర్యావరణ పరిరక్షణ కొరకు వినాయకచవితి పండగలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఇటీవల నాటకరంగంపై పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందిన కార్యదర్శి రంగరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కో-చైర్మన్ దంగేటి రామలింగేశ్వరరావు, సాగిరాజు విజయ్, కే నాగేశ్వరరావు, మున్షీ, సలహా బోర్డు సభ్యుడు యశోద కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలు అరికట్టాలి

సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా



తణుకులో ధర్నాలో పాల్గొన్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

తణుకు: తరచూ ఫార్మా కంపెనీల్లో జరుగుతున్న ప్రమాదాలు యాజమాన్యాల నిర్లక్ష్య ఫలితమేనని, ఫ్యాక్టరీల్లో భద్రతాపరమైన లోపాలను అరికట్టి కార్మికుల ప్రాణాలు కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఆదివారం తణుకు వీరనారాయణ సెంటర్‌లో భగత్ సింగ్ విగ్రహం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఫార్మా కంపెనీల్లోని ప్రమాదాల్లో యాజమాన్యాల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి భీమారావు మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది, పరవాడ ఫార్మాసిటీ కంపెనీలో ఒక కార్మికుడు ప్రాణాలు కోల్పోయారన్నారు. ప్రమాదాలకు ప్రధాన కారణం కంపెనీల యాజమాన్యాలు భద్రతాపరమైన చర్యలు తీసుకోకపోవడమేనన్నారు. భద్రతా పరమైన చర్యలు పాటించని కంపెనీ యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియో ప్రకటించిన ప్రభుత్వం తక్షణమే కార్మిక కుటుంబాలకు చెల్లించాలని కోరారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, మహిళాసమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, ఏఐటీయూసీ నాయకులు అనంత త్రివిక్రమరావు, దాకే ముసలయ్య, గెడ్డం చంద్రశేఖరరావు, కరుటూరి ప్రసాద్, పాల్గొన్నారు.

మూర్తిరాజు స్ఫూర్తితో అభివృద్ధి పథం



దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ కళాశాల

స్వర్ణోత్సవాల దిశగా వీవీ గిరి ప్రభుత్వ కళాశాల

ఆకివీడు: గ్రామీణ ప్రాంతాలకు ఉన్నత విద్య చేరువ చేయాలనే ఆశయంతో స్వాతంత్ర్య సమర యోధులు, గాంధేయవాది, విద్యా దాత స్వర్గీయ చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు జిల్లాలో అనేక విద్యా సంస్థలను నెలకొల్పారు. ఇదేవిధంగా దుంపగడలో 20 ఎకరాల విస్తీర్ణంలో డిగ్రీ, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేశారు. దేశభక్తి, జాతీయ నాయకుల స్ఫూర్తితో జూనియర్ కళాశాలకు ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులు, డిగ్రీ కళాశాలకు వరాహగిరి, వెంకట గిరిగా నామకరణం చేశారు. దాతల సహకారంతో విశాలమైన క్రీడా ప్రాంగణం, కళాశాలల ఏర్పాటుకు స్థలం సమకూర్చారు. అయితే అప్పట్లో భవనాలు నిర్మించలేక పూరి పాకల్లోనే విద్యను కొనసాగించారు. సుమారు మూడు దశాబ్దాల పాటు పూరి పాకల్లో ఉన్నత విద్యను అందించారు. ప్రస్తుతం పూర్వ విద్యార్థులు కళాశాలల అభివృద్ధికి నడుంబిగించి కళాశాలల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి దాతల స్ఫూర్తితో పక్కా భవనాలకు నాంది పలికారు. ఎంపీ ల్యాడ్స్, ఇతర నిధులను సేకరించి పక్కా భవనాలు నిర్మించి మౌలిక వసతులు, కంప్యూటర్ సైన్స్, ల్యాబ్స్ అందుబాటులోకి తెచ్చారు. దీంతో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.

ఆనర్స్ కోర్సులున్నాయి



దుంపగడప కళాశాలలో డిగ్రీలో ఆనర్స్ కోర్సులు కొనసాగుతున్నాయి. ఎన్ఈపీ-2020 విద్యా విధానం ప్రకారం బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్, బీఎస్సీ ఫిజిక్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్సు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గతంలో బీఏ, బీకాం కోర్సులు మాత్రమే ఉండేవి. స్కిల్‌హబ్ కూడా ఉంది.

– కె.సుజాత, ప్రిన్సిపాల్, వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుంపగడప

నాక్ రెండో సారి గుర్తింపునకు సిద్ధం

కళాశాలకు తొలిదశలో నాక్ బీప్లస్ గ్రేడ్ దక్కింది. కళాశాల అభివృద్ధి, పనితీరు, లైబ్రరీ, క్రీడా ప్రాంగణం, పూర్వ విద్యార్థుల ఉన్నత స్థితి, దాతలు తదితర అంశాల్ని త్వరలో కళాశాలను సందర్శించే నాక్ బృందం మరోసారి పరిశీలించనుంది. ఈ నేపథ్యంలో నాక్ గ్రేడ్ మెరుగుపడే అవకాశాలు ఉన్నాయి.